# నాణ్యమైన విద్యకు కేరాఫ్ ప్రభుత్వ బడి

**దాదాపు 529 ప్రైవేట్ స్కూల్స్ నుంచి సర్కారుకు కొత్తగా 12,816 అడ్మిషన్లు..**

**అభివృద్ధి కోసం జిల్లాలో మొత్తం 282 స్కూళ్లు ఎంపిక**

- మనబస్తీ-మనబడి కింద ప్రారంభానికి సిద్ధంగా ఉన్న 21 స్కూళ్లు
- దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ప్రత్యేక కార్యక్రమాలకు ముస్తాబైన బడులు
- ఆంగ్ల మాధ్యమానికే ప్రాధాన్యతనిస్తున్న విద్యార్థులు



సిటీబ్యూరో, జూన్ 19 (నమస్తే తెలంగాణ) : నాణ్యమైన విద్యా విధానానికి జిల్లాలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలు కేరాఫ్‌గా నిలుస్తున్నాయి. సీఎం కేసీఆర్ తొమ్మిదేండ్లలో సాధించిన విద్యా ప్రగతిపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతున్నది. గతంలో సర్కారు స్కూల్స్‌కు రావాలంటేనే చిన్నచూపుగా భావించే విద్యార్థులు ఇప్పుడు అదే ప్రభుత్వ బడికి అడ్మిషన్ పొందడానికి పోటీ పడుతున్నారు. ప్రభుత్వ బడుల్లో మరుగుదొడ్ల నిర్మాణాలు, వాటి నిర్వహణ, అవసరమైన సదుపాయాలతో పాటు రక్షిత మంచినీటి సదుపాయాలకు చర్యలు తీసుకుంటున్నది. మన బస్తీ - మనబడి కింద జిల్లాలోని దాదాపు ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేస్తుండగా... ప్రతి యేడాది విద్యార్థుల ప్రవేశాల సంఖ్య పెంచుకోవడానికి బడిబాట కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున అధికారులు నిర్వహిస్తున్నారు.

## ప్రభుత్వ బడులకు పెరుగుతున్న వలసలు

ప్రభుత్వం విద్యాభివృద్ధికి పెద్ద పీట వేయడంతో పాటు జిల్లాలో ఆలియా, మహబూబియాతో పాటు అనేక సర్కారు స్కూల్స్‌ను అభివృద్ధి చేసింది. దీంతో పాటు ఇంగ్లిష్ మీడియంలో విద్యా బోధన అందించడం వల్ల ప్రైవేటు నుంచి సర్కారు స్కూళ్లకు వలస వస్తున్నారు. 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించి జిల్లాలో మొత్తం 12,816 అడ్మిషన్లు కొత్తగా నమోదవ్వగా... ఇప్పటి వరకు దాదాపు 529 ప్రైవేటు స్కూల్స్ నుంచి ప్రభుత్వ పాఠశాలలకు విద్యార్థులు వచ్చారు. జిల్లాలో 282 ప్రభుత్వ పాఠశాలలను మనబస్తీ-మనబడి కింద ఎంపిక చేశారు. ఈ మొత్తానికి దాదాపు రూ.50 కోట్ల వరకు నిధులు కేటాయించినట్లు సమాచారం. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ప్రస్తుతం ఈ విద్యా సంవత్సరం ప్రారంభంలోనే 15 నియోజకవర్గాల్లో 21 పాఠశాలలను ఎంపిక చేశారు. అయితే ఎంపిక చేసిన 21 పాఠశాలల్లో అభివృద్ధి పనులు ప్రారంభిస్తారు. మిగిలిన ఏడు స్కూళ్లలో దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు డీఈవో ఆర్ రోహిణి తెలిపారు. ఈ మేరకు జాబితా విడుదల చేశారు.

### స్కూళ్ల జాబితా వివరాలు...

| | | |
|---|---|---|
| 1.అంబర్‌పేట్ | రానా ప్రతాప్ ఫంక్షన్‌హాల్ | దశాబ్దిఉత్సవాలు |
| 2.బహదూర్‌పుర | జీహెచ్‌ఎస్ గుల్‌బల్‌గూడ | దశాబ్ది ఉత్సవాలు |
| 3.చాంద్రాయణగుట్ట | జీపీఎస్ ఛత్రిమేట్ | దశాబ్ది ఉత్సవాలు |
| 4.చార్మినార్ | ఫ్లాస్ ఎంవోబి చార్మినార్ | దశాబ్ది ఉత్సవాలు |
| 5.గోషామహల్ | ప్రభుత్వ ప్రాథమిక స్కూల్ చిరాగ్ అలీ లేన్ | మనబస్తీ-మనబడి |
| 6.గోషామహల్ | ప్రభుత్వ బాలుర హైస్కూల్, అబిడ్స్ | మనబస్తీ-మనబడి |
| 7.గోషామహల్ | ప్రభుత్వ బాలుర హైస్కూల్, గాంధీభవన్ | మనబస్తీ-మనబడి |
| 8.గోషామహల్ | ప్రభుత్వ ప్రాథమిక స్కూల్, గోషామహల్ | మనబస్తీ-మనబడి |
| 9.జూబ్లీహిల్స్ | జీహెచ్‌ఎస్ అమీర్‌పేట్ | మనబస్తీ-మనబడి |
| 10.కార్వాన్ | ప్రభుత్వ ప్రాథమిక స్కూల్, లంగర్‌హౌజ్ | మనబస్తీ-మనబడి |
| 11.ఖైరతాబాద్ | ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, ఓల్డ్ ఎమ్మెల్యే క్వార్టర్స్ | మనబస్తీ-మనబడి |
| 12.ఖైరతాబాద్ | జీహెచ్‌ఎస్, హైదర్‌గూడ | మనబస్తీ-మనబడి |
| 13.ఖైరతాబాద్ | జీపీఎస్, ఫిలింనగర్ | మనబస్తీ-మనబడి |
| 14.మలక్‌పేట్ | జీహెచ్‌ఎస్, మలక్‌పేట్ | మనబస్తీ-మనబడి |
| 15.మలక్‌పేట్ | జీపీఎస్, మలక్‌పేట్ | మనబస్తీ-మనబడి |
| 16.మలక్‌పేట్ | జీపీఎస్ (బాయ్స్), ధోబీగల్లీ, అంబర్‌పేట్ | మనబస్తీ-మనబడి |
| 17.ముషీరాబాద్ | జీపీఎస్, జవహర్‌నగర్ | దశాబ్ది ఉత్సవాలు |
| 18.నాంపల్లి | జీపీఎస్, విజయనగరకాలనీ ఆసిఫ్‌నగర్ | మనబస్తీ-మనబడి |
| 19.సనత్‌నగర్ | జీహెచ్‌ఎస్ అమీర్‌పేట్, డీకేరోడ్ | మనబస్తీ-మనబడి |
| 20.సనత్‌నగర్ | జీపీఎస్, డీకేరోడ్ | మనబస్తీ-మనబడి |
| 21.సనత్‌నగర్ | జీహెచ్‌ఎస్, బన్సీలాల్‌పేట్ | మనబస్తీ-మనబడి |
| 22.సనత్‌నగర్ | జీపీఎస్, కవాడిగూడ | మనబస్తీ-మనబడి |
| 23.సికింద్రాబాద్ | జీపీఎస్, అడ్డగుట్ట | మనబస్తీ-మనబడి |
| 24.సికింద్రాబాద్ | జీహెచ్‌ఎస్, ఎంపీబాగ్ | మనబస్తీ-మనబడి |
| 25.సికింద్రాబాద్ | జీహెచ్‌ఎస్, లాలాపేట్ మార్కెట్ | మనబస్తీ-మనబడి |
| 26.సికింద్రాబాద్ | జీపీఎస్, లాలాపేట్ | మనబస్తీ-మనబడి |
| 27.కంటోన్మెంట్ | జీబీహెచ్‌ఎస్, తిరుమలగిరి | దశాబ్ది ఉత్సవాలు |
| 28.యాకుత్‌పుర | జీజీహెచ్‌ఎస్, చౌని | దశాబ్ది ఉత్సవాలు |



## జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో 'నారాయణ' ప్రభంజనం

సిటీబ్యూరో, జూన్ 19 (నమస్తే తెలంగాణ): జేఈఈ అడ్వాన్స్‌డ్-2023 ఫలితాల్లో దిల్‌సుఖ్‌నగర్ నారాయణ కళాశాల విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. జాతీయస్థాయి ఓపెన్ కేటగిరిలో 9వ ర్యాంకుతో మొదటి స్థానంలో దిల్‌సుఖ్‌నగర్ డివిజన్ నుంచి బాలాజీ రెడ్డి నిలిచాడు. అన్ని విభాగాల్లో కలిపి 100 ర్యాంకుల్లోపు 15 మంది విద్యార్థులు, 1000లోపు 82 మంది, 5వేలలోపు 150 మంది, 10వేలలోపు 168 మంది విద్యార్థులు ర్యాంకులు సాధించారని చెప్పారు. నారాయణ దిల్‌సుఖ్‌నగర్ కోర్‌డీన్ వెంకట్‌రెడ్డి, రాధాకృష్ణ, ఉపాధ్యాయులు, డీజీఎం రాజు, ఏజీఎం కేశవరెడ్డి ర్యాంకులు సాధించిన వారిని సోమవారం సత్కరించి అభినందించారు.



## బాక్సింగ్‌లో సత్తా చాటిన ఖదీజా బేగం

రాష్ట్ర స్థాయి బాలికల బాక్సింగ్ చాంపియన్‌షిప్ టైటిల్‌ను ఖదీజా బేగం సొంతం చేసుకుంది. సోమవారం షేక్‌పేట్ ఇండోర్ స్టేడియంలో జరిగిన 5వ రాష్ట్ర స్థాయి జూనియర్ బాలికల బాక్సింగ్ చాంపియన్‌షిప్ 63 కేజీల విభాగం ఫైనల్స్‌లో ఖదీజా బేగం 11-09 పాయింట్ల తేడాతో భాగ్యలక్ష్మి పై విజయం సాధించింది. 53 కేజీల విభాగంలో రబియా బేగం కాంస్యం, ఖదీజా బేగం స్వర్ణ పతకం సాధించి జాతీయ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో పాల్గొనేందుకు రాష్ట్రం నుంచి ఎంపికయ్యారు.

*- హైదరాబాద్, ఆట ప్రతినిధి జూన్ 19*

## బీఈడీ కాలేజీల్లో గెస్ట్ లెక్చరర్ల భర్తీకి నోటిఫికేషన్

సిటీబ్యూరో, జూన్ 19 (నమస్తే తెలంగాణ) : జిల్లాలోని ఇనిస్టిట్యూట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ స్టడీస్ ఇన్ ఎడ్యుకేషన్ (బీఈడీ) కాలేజీల్లో గెస్ట్ లెక్చరర్ల భర్తీ కోసం సోమవారం నోటిఫికేషన్ జారీ చేస్తూ ఆ కాలేజీ ప్రిన్సిపాల్ నిర్ణయం తీసుకున్నారు. దరఖాస్తు చేసుకోవడానికి ఈ నెల 20 నుంచి 30 వరకు గడువు విధించినట్లు తెలిపారు. పీజీలో 55 శాతం మార్కులు సాధించడంతో పాటు సంబంధిత సబ్జెక్టులలో బీఈడీ, ఎంఈడీ ఉండాలని, బోధన మొత్తం ఆంగ్ల మాధ్యమంలోనే ఉంటుందన్నారు. ఎడ్యుకేషన్ ఫౌండేషన్ లెక్చరర్, సైన్స్, మ్యాథమెటిక్స్/స్టాటిస్టిక్స్, సోషల్ స్టడీస్, లాంగ్వేజ్, ఐసీటీ/కంప్యూటర్ ఎడ్యుకేషనల్, ఫిజికల్ ఎడ్యుకేషన్, విజువల్ ఆర్ట్స్ అండ్ ఫర్‌ఫార్మింగ్ ఆర్ట్స్‌లో గెస్ట్ లెక్చరర్స్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు.

# కేసీఆర్ పాలనకు ఆకర్షితులై..



ఎమ్మెల్యే గోపీనాథ్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరిన ఎంఐఎం నాయకులు, కార్యకర్తలు

వెంగళరావునగర్, జూన్ 19 : ముఖ్యమంత్రి కేసీఆర్ పరిపాలనకు ఆకర్షితులై బీఆర్‌ఎస్ పార్టీలో ఇతర పార్టీల నాయకులు భారీగా చేరుతున్నారని జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ అన్నారు. సోమవారం రహ్మత్‌నగర్ డివిజన్ హబీబ్ ఫాతిమా నగర్ ఫేజ్ -1 బస్తీలో ఎంఐఎం పార్టీ నుంచి 100 మందికి పైగా యువకులు, మహిళలు జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే, హైదరాబాద్ జిల్లా బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు మాగంటి గోపీనాథ్ సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై అన్ని వర్గాల ప్రజలు బీఆర్‌ఎస్ పార్టీలో చేరుతున్నారన్నారు. పార్టీలో చేరిన వారిలో జహూర్‌పాషా, షేక్ మోసిన్, కలీముద్దీన్, అప్సర్, అక్రమ్ హుస్సేన్, హస్నుద్దీన్, సామి, మాకిన్ ఉన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు తన్నూఖాన్, డివిజన్ ప్రధాన కార్యదర్శి సుబ్బరాజు, నజీర్, జబ్బార్, రఫీ, అర్షద్, జగన్ పాల్గొన్నారు.



## బీఆర్‌ఎస్‌లో చేరికలు

మహారాష్ట్ర భీడ్ జిల్లాకు చెందిన పలు పార్టీలకు చెందిన నాయకులు రాష్ట్ర హోంశాఖ మంత్రి మహమూద్ అలీ సమక్షంలో బీఆర్‌ఎస్ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా వారికి హోంమంత్రి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం హోంమంత్రి మహమూద్ అలీ మాట్లాడుతూ బీఆర్‌ఎస్ పార్టీకి రోజు రోజుకు ఆదరణ పెరుగుతోందన్నారు. పార్టీలో చేరిన వారిలో కాంగ్రెస్, ఎన్‌సీపీకి చెందిన యాతీబ్, విద్యా యాదవ్ పాండే, మొమిన్ సమీయుద్దీన్, షము, అభినయ్ వాగ్మారే తదితరులు 15 మంది ఉన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మైనార్టీ రాష్ట్ర నాయకుడు ఎంకే బద్రుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

*- అబిడ్స్, జూన్ 19*



## నూతన డిజైనర్ స్టోర్ ప్రారంభం

జెడ్‌వైఎల్‌కే డిజైనర్ ఫ్యాబ్రిక్ స్టోర్‌ను నగరంలోని బంజారాహిల్స్ రోడ్డు నంబర్-14లో ప్రారంభించారు. నగరంతోపాటు దేశంలోని ప్రముఖ డిజైనర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. 10 రోజుల పాటు అన్ని రకాల డిజైన్ వస్త్రాలపై 20శాతం తగ్గింపు ఇస్తున్నట్లు ప్రకటించారు.

*- సిటీబ్యూరో, జూన్ 19 (నమస్తే తెలంగాణ)*